

పెద్దకథ

# దేవతలు తిరిగేచోటు

-జయ

రామం కూర్చోలేకపోతున్నాడు. మనసంతా మహా అసహనంగా వుంది. సెకను సెకనుకూ టైం చూసుకుంటున్నాడు. గంట కొడితే, లేచి చక్కా క్లాసురూం నుంచి బయట పడాలని వుంది. టెన్షన్, అసహనం పెరిగిపోతుంటే, ఒంటి నుంచి వేడి ఆవిర్లు వస్తున్నట్టుగా వుంది. మొహంమీద, అరచేతుల్లో చిరుచెమట.

ప్రక్కనే కూర్చున్న అతని స్నేహితుడు అహ్మద్, లెక్చరర్ పాఠం నుంచి దృష్టి మళ్ళించి, రామం వైపు విచిత్రంగా చూశాడు. ఎప్పుడూ ధ్యానంతో, ఏకాగ్రతతో పాఠం వినే ఏకసందాగ్రాహి రామం– ఇలా ముళ్ళగంప మీద, చీమల పుట్టమీద కూర్చున్నట్టు ఫీల్ అవుతున్నాడంటే!

మెల్లిగా, రామం చెవి పక్కగా మెడని సారించి– 'ఏవిట్రా? తోకకి దారం కట్టిన తూనీగలా గిలగిల్లాడుతున్నావ్–' అనడిగాడు.

'టైము నాలుగు దాటుతోంది. మా వదిన, నాలుగ్గంటల నుంచీ వరండాలో కూర్చుని, నాకోసం ఎదురు చూస్తూ వుంటుంది. వెళ్ళిపోవాలిరా–' అన్నాడు గుసుగుసగా, ఎగవూపిరి– దిగవూపిరిగా.

ఈ సమాధానానికి అహ్మద్ మరింత విచిత్రపడి, రామం మొహం వైపు పరిశీలనగా– వింతగా చూస్తుండగా బెల్ మోగింది. తక్షణం బాహ్యప్రపంచంతో సంబంధం తెగి పోయినట్టు, కాకిగూడులో పొదిగినా– స్వరం రాగానే కోయిల కూనలా ఎగిరిపోయినట్టు, జీవుడికి మాయ తెరజారి బ్రహ్మదర్శనం అయినట్టు వుద్రేకంగా, స్ప్రింగ్‌లా లేచి, గబగబా క్లాస్‌రూం బయటికి పరిగెత్తాడు.

టేబిల్‌మీద తన నోట్సు, టెక్ట్స్ సర్దుకుంటున్న లెక్చరర్ కృష్ణస్వామి– ఉదయ రేఖల్ని విచ్చుకోనివ్వకుండా, వర్షమేఘం కమ్మేస్తే– సూర్యకిరణాలు తెల్లబోయి పరావర్తనం చెంది నట్టు– అలాగే తెల్లబోతూ రామం వెళ్ళినవైపు చూస్తూండి పోయారు.

ఆయన అంతగా స్టన్ అవ్వడానికి కారణం వుంది. రామం ఆయన ఫేవరెట్ స్టూడెంట్. రామం కూడా పంచదారలో తీపి వున్నంత సహజంగానూ, స్వచ్ఛంగానూ గురువును దైవంగా భావించే శిష్యుడు. రోజూ సాధారణంగా క్లాసు అయ్యాక లెక్చరర్ గారి నోట్స్ పట్టుకుని, ఆయన వెనకాల వినమ్రంగా డిపార్ట్ మెంట్ వరకు వచ్చి, అవి ఇవి పాఠ్యాంశాల గురించిన తన సందేహాల్ని, తను నేర్చుకున్న విజ్ఞానాన్ని లెక్చరర్‌గారి జ్ఞానంతో కొలుచుకుని తన ఎదుగుదలని అంచనా వేసుకుంటూ ఎదుగుతున్న నిజమైన శిష్యుడు. అలాంటి రామం ఇలా ప్రవర్తించేసరికి లెక్చరర్ ఖంగుతిన్నట్టు నిలువడిపోవడమే కాకుండా, ఆయన మనసులో ఏ మూలో గోరింత ముల్లు గుచ్చుకున్నట్టు చివుక్కుమంది. కంట్లో నలక పడి, చూపుకి ఇబ్బంది అయినట్టు అనిపించింది.

* * *

వైదేహి వరండా ఈజీ చైర్లో కూర్చుని సందు మలుపు వైపు చూస్తూ నిరీక్షిస్తోంది. నీరెండ ఆమె లేత గులాబీ రేకులాంటి మృదుమోముపై పడి ఎర్రబారుతోంది. నిశ్చలంగా, ప్రశాంతంగా, వెన్నెలని నెమరేస్తూ గోదావరి– తన ఒడ్డున ప్రశాంతంగా నిశి ఒడిలో నిద్రపోతున్న మహా పట్టణాలని, కుగ్రామాలని సరిసమానంగా ప్రేక్షకురాలిగా వీక్షిస్తున్న ట్టుగా వైదేహి అలా కూర్చుని రామం కోసం ఎదురు చూస్తోంది.

సందు మలుపులో, ఈదురుగాలిలా– సైకిల్‌పై దూసుకువస్తున్న రామాన్ని చూడగానే, ఆమె కళ్ళు గుర్తింపుతో ఆల్చిప్పల్లా విప్పారాయి. గబుక్కున లేచి, తెల్లవారుఝాము చల్ల గాలికి, గుడి ధ్వజస్తంభపు తిరుఓంకారాల్లో గుడి చేస్తున్నట్టుగా, ఆమె ధ్వని తరంగంలా, కాంతిరేఖలా కదులుతూ వెళ్ళి గేటు తెరిచింది.


ఆయాసపడుతూ, సైకిల్ దిగుతూనే, వదినని చూడగానే తెల్లవారుఝాము కోనేట్లో మహాహుషారుగా ఈదే చేపపిల్లల్లా, రామం మోములో ఆనంద వీచికలు కలగావులగంగా కదిలాయి. మాతృత్వాన్ని పొదువుకున్న స్త్రీత్వంతో, ఏడు రంగుల నిండుదనం, ఇంద్ర ధనసులా నిలబడి, నిలబెట్టే రూపుతో వున్న వదినని చూడగానే, రామం హృదయం ఆదోరకం అర్థం కాని, అర్థం చెప్పలేని అనుభూతి, ఆరాధనలతో నిండిపోయాయి.

వైదేహి మాతృ హృదయం, రామం మొహంలో ప్రతిఫలిస్తున్న సంతృప్తి హాసి రేఖల్ని పట్టించుకోకుండా, వదలిపోయి జిడ్డుకారుతున్న ముఖాన్ని మాత్రం గమనించి– "ఏం బంగారం! మొహం అలా వాడిపోయిందేవయ్యా, మీ కాలేజీలో చదువు చెబుతున్నారా? రాళ్ళు కొట్టిస్తున్నారా?" అంది చిరుకినుకతో.

రామం హాయిగా నవ్వేస్తూ– సైకిల్‌ని లోపల పెడుతూ– "ఈ రోజు నీకు బాగా బోర్ కొట్టిందా? ఒక్కదానివే ఇంట్లో ఒంటరిగా వుంటావని అనిపించినప్పుడల్లా, మనసులో భరించలేని దిగులు కలిగింది తెల్సా?"

"మరీ బోర్ కొట్టలేదులే. నీకిష్టమని బజ్జీలు చేశా. కొత్తిమీర పచ్చడి కూడా. అవి నువ్వు రాకుండా, తినకుండా ఎక్కడ వేడి చల్లారిపోతాయో అని ఈ క్షణం వరకు ఒకటే ఆతుత అనుకో– రా తిందువుగాని, ఎప్పుడో మధ్యాహ్నం కతికిన మెతుకు–"

అతని హృదయం గర్వంతో, గొప్పతో, ఉద్వేగంతో ఉల్లాసంతో వుప్పొంగి



పోతూ, ఆ భావాల్ని తట్టుకోలేనంతగా వణికిపోయింది. తన కోసం, తనకి ఇష్టమని, వదిన తను ఆరాధించే దేవత కష్టపడి బజ్జీలు చేసిందంటే–

"వుందు వదినా– ఇదో చిటికెలో వచ్చేస్తా–" టవల్ భుజాన వేసుకుని బాత్రూంలో దూరాడు.

అతని ఉత్సాహపు హడావుడి చూసి, వైదేహి ముగ్దంగా నవ్వుకుంది.

మరో పదినిముషాల్లో, వేకువఝాము తెల్లగులాబీలా, తెలతెల్లటి పైజమా వేసుకుని, నల్ల వుంగరాల ఒత్తు జుత్తుని, వెనక్కి నొక్కిపెట్టి దువ్వి– కొత్తగా కోసిన గంధపు చెక్కలా సువాసన వెదజల్లుతూ, వచ్చిన మరిదిని ఆపాద మస్తకం చూసి, సంతృప్తిగా ఆనందించి, బజ్జీల ప్లేటుని ముందు పెట్టి– "తిను కన్నా–" అంటూ కొసరి కొసరి పెట్టి బుజ్జగిస్తూ– వంకాయ బజ్జీ, వుల్లిపాయ బజ్జీ, బీరకాయ బజ్జీ, అరటికాయ బజ్జీ, వాముఆకు బజ్జీ అంటూ రకరకాలుగా పెడుతూ తినిపించింది.





Heros BS-40A TEL

'అబ్బ చాలు వదినా- ప్లీజ్ వదినా- వద్దు వదినా- అమ్మో వదినా" అంటూనే వైదేహి పెట్టినవన్నీ తిన్నాడు.

కడుపు దోరగా నిండిన తర్వాత, వేడి వేడి టీ తాగుతుంటే- "ఏం నాన్నా- కాలేజీ నుంచి అలసిపోయి వచ్చినట్టున్నావు. ఈ రోజు శుక్రవారం కదా- గుడికి వెళ్ళాలి. వెళ్ళిరానా-" అంది.

రామం- తీరం చేరకుండానే, సముద్రం మధ్యలోనే విరిగిపడిన అలలా హర్ట్ అయిపోతూ- "ఏం వదినా, నన్నొదిలేసి, నువ్వొక్కదానివే గుడికి వెళతావా?" అన్నాడు కినుకగా.

"అది కాదు బంగారం. ప్రొద్దుట్నించీ, ఆ కాలేజీ పాఠాలు విని విని విసుగెత్తి వుంటావు. కాస్త రెస్ట్ తీసుకుంటావని-"

రామం వైదేహి మాటలు వినిపించుకోకుండా మొహాన్ని కందగడ్డలా ఎర్రబా ర్చుకుని - "నాకు తెల్సులే వదినా - నువ్వు ననఉ ఎలాగైనా, ఏదో కారణం చెప్పి వదిలించుకుని హేపీగా నువ్వు మాత్రం వెళ్లాలనుకుంటున్నావు. సరేలే. నేను నీకంత భారంగా వుంటే రానులే. నువ్వే వెళ్ళు-"

గాలి వీచినప్పుడల్లా, సన్నజాజి గుతులు పచ్చతీగ పొదల మాటుకి మొహం చాటేసినట్టుగా చిన్నబుచ్చుకున్న మరిదిని చూసి - "లేదోయ్. నిన్ను వదిలి వెళ్ళడం, నువ్వు పక్కన లేకుండా వెళ్ళడం నాకుమాత్రం బావుంటుందా? లక్ష్మణరేఖ దాటినట్టేగా-" అని నవ్వింది. గుక్కపెట్టి ఏడుస్తున్న పసివాడ్ని డైవర్ట్ చేయడానికి వూయల వూపినట్టుగా, చిచ్చుకొట్టినట్టుగా-

"నాకు కోపం వచ్చింది వదినా -"

"మా బుజ్జి కొండవి కదూ - 'అమ్మ' మీద అలా కోపం తెచ్చుకోవ చ్చునా-" అప్పుడప్పుడురామం వైదేహిని 'అమ్మ' అని పిలుస్తూ వుంటాడు. కేవలం నాలుగైదేళ్ళవయసు వ్యత్యాసం వున్నవదినా మరుదుల మధ్య ఈ విచిత్రం బంధం చూసే వాళ్ళకి మొదట్లో వింతగా వుండేది. ఇప్పుడు అలవాటైపోయింది.

వైదేహి 'అమ్మ' అనగానే - అతనిలో చిన్న కదలిక. 'అమ్మ' తనకు ఊహ తెలిసీ తెలియని వయసులో శ్మశానం వరకు ఆఖరి ప్రయాణం చేసిన అమ్మ, అమ్మ ఒడి, స్పర్శ, ఆప్యాయత, ఆపేక్ష - ఇన్ని సంవత్సరాలు తను కోల్పోయాడన్న విషయం, వైదేహి తన జీవితంలోకి వచ్చాకనే తెలిసింది. చీకటిలో బ్రతుకుతున్నవాడికి సూర్యుడు అనే వాడున్నాడని చూస్తేగా తెలుస్తుంది.

"ఏవయ్యా - శివుడి ముందు నందీశ్వరుడిలా అలా నిలబడిపోతే ఎలా - పద గుడికి వెళ్ళాలి. దేవి దర్శనం చేసుకోవాలి-"

అతను నవ్వేస్తూ - "పద వదినా-" అంటూ వదిన చేతిలో పూలసజ్జ అందుకున్నాడు.

* *   * *   * *

కదిలి కదిలి ప్రవహిస్తున్న గోదావరి పాయలా వైదేహి నడుస్తుంటే, ఆమె ప్రక్కనే కొంచెం వెనుకగా పూజా సామాగ్రి వున్న సజ్జ పట్టుకుని "అబ్బ వదిన పక్కన ఇలా నడవడం ఎంతో హాయిగా వుంది. వెధవ టెన్నిస్ ఆడితే ఏం వస్తుంది. వెధవ మెడల్స్, షీల్డులు తప్ప. అవి హాలులో టేబిల్ మీద పెట్టుకుంటే దుమ్ము కొట్టుకుపోయి, దేభ్యపు మొహాలు వేసుకుని వుంటాయి తప్ప. ఇలా హృద్యమైన భావాలు మధుర స్మృతులై హృదయంలో ఒదిగి వుండవు కదా-

గుడిలో పూజారి అమ్మవారికి అర్చన చేస్తుంటే - ఆ జగన్మోహన రూపి ణికి వినమ్రంగా వదిన మొక్కుతుంటే అతనికి మాత్రం అమ్మవారిలోకన్నా, వదినలోనే ఎక్కువ దైవత్వం, తల్లితనం కనిపించాయి.

ఇద్దరు గుడి ఆవరణలో ధ్వజ స్తంభం పక్కన కూర్చున్నారు. కనకాం బరం రంగు చీరలో, ఒత్తయిన నిడుపాటి జడతో, నిండుగా సన్నజాజుల మాలతో, పాపటన ఎర్రెర్రని కుంకుమతో, నిర్మలత్వం, మృదుత్వం తళుక్కు మనే మోముతో, సుస్నితత్వాన్ని పోగేసుకున్న తామర తూడుల్లాంటి చేతులకి ఆరెంజి కలర్ రంగు రంగు గాజులు గలగల లాడుతుంటే - కొబ్బరి చెక్క

కొట్టి - ఒక ముక్క తీసి మరిదికి అందిస్తూ ప్రసాదం అంది.

చిన్న చిన్న మాటలు కూడా వదిన ఎంత స్వరయుక్తంగా మాట్లాడుతుంది అనుకుంటూ - కొబ్బరి ముక్క అందుకున్నాడు.

చీరకుచ్చిళ్ళు సవరించుకుంటుంటే, తమలపాకులాంటి లేత పాదాలకి వెండి హంస పట్టీలు మెరుస్తుంటే చూస్తూ - వదిన తన జీవితంలోకి రాకముందు సాయంత్రాలు ఎంతో నిస్సారంగా, నిష్ఫలంగా గడిచేవి. తను కాలేజీ నుంచి, అటునుంచి అటే టెన్నిస్ కోర్టుకి వెళ్ళి,రాత్రి తొమ్మిది వరకూ టెన్నిస్ ప్రాక్టీస్ చేసేవాడు. తను టెన్నిస్ కోచ్ పార్థసారథి పెట. కానీ వదిన కాపురానికి వచ్చినప్పటి నుంచీ, అన్నయ్య ఇంట్లో వుండక పోవడం, వదిన ఒంటరిగా వుంటుందే అనే ఫీలింగ్ వలన తను చాలా వరకు టెన్నిస్ ప్రాక్టీస్ నిర్లక్ష్యం చేసి కాలేజీ అవ్వగానే ఇంటికి వచ్చేస్తున్నాడు. గత పది రోజులుగా అసలు తాను కోర్టు మొహమే చూడలేదు. పార్థసారథిగారు మండిపడుతూ వుండొచ్చు.

"ఏం కన్నా - ఏవిటి అంత దీర్ఘాలోచన-" తల పక్కకు తిప్పి మరిది మొహంలోకి చూసి నవ్వుతూ అడిగింది వైదేహి.

"నువ్వు వచ్చాక జీవితం ఎంతో అద్భుతంగా సంతృప్తికరంగా గడపొచ్చో తెలిసింది వదినా. అంతకుముందు ఆ జీవితాన్ని నువ్వు లేకుండా ఎలా గడిపానా అనిపిస్తోంది-"

వైదేహి మనోహరంగా నవ్వేస్తూ - నీలో భావుకత మరీ ఎక్కువ రామం-

"లేదు వదినా. ప్రకృతిలా మనిషి కూడా. శిశిరంలో తన పచ్చదనాన్ని అంతా రాల్చేసుకుంటుంది. వసంతంలో రంగు రంగులుగా ముసతాబై, కోయిలల్ని, సీతాకోకచిలుకల్ని నేస్తాలుగా చేసుకుంటుంది. మా అమ్మ పోయినప్పుడు, నాకు మాతృత్వపు తియ్యదనం కూడా తెలీసి పసితనంలో వున్నా - కానీ నువ్వు వచ్చాక బాల్యం అనుభవించకుండానే పెద్దవాడిని అయినా మళ్ళీ పోయిన బాల్యాన్ని నీ వలన అనుభూతించగలుగుతున్నా. శీతాకాలంలో చిరువెచ్చటి ఉదయకాంతులు, వేసవిలో చల్లటిగాలులను సాయి కలిగించే సాయంత్రాలు మనసుకి సహజమైన ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయి. నువ్వు కూడా నాకు అటువంటి అలవికాని ఆనందాన్ని, సంతృప్తిని, మనశ్శాంతిని కలిగించావు. అది వరకు నేను ఎంతో రెస్ట్‌లెస్‌గా, విసుగ్గా వుండేవాడ్నే నీకు తెలుసా?

వైదేహి నవ్వి "నీ వయసు పిల్లవాడిలా -"

"అంటే?!"

"సిగరెట్లు కాల్చుకుంటూ, రోడ్ల కొలతలు వేస్తూ, సెంటర్స్‌లో నిల్చుని అమ్మాయిల గురించి జోకులు పేల్చుకుంటూ, అర్ధరాత్రి చెత్త సినిమాలు చూస్తూ -కానీ నువ్వు తెలివైన వాడివి కాబట్టి బాగా చదువుతూ టెన్నిస్ ఆడుతూ"

రామం క్షణం ఆశ్చర్యపడి "నీకెలా తెల్సు వదినా ఇంత విపులంగా -"

వైదేహి అలలు అలలుగా నవ్వుతూ "నువ్వే చెప్పావు బంగారం. లేకపోతే నా దగ్గర ఏవైనా మాయమంత్రం వుందనుకున్నావా?"

రామం వైదేహివైపు ఆరాధనగా చూస్తూ "నీకు ఒక మాయ మంత్రం మాత్రం తెలుసు వదినా. నీ పరిధిలోకి వచ్చిన ప్రతి ఒక్కర్ని అద్భుతమైన మనశ్శాంతినిచ్చే ఆనంద లోకానికి తీసుకు వెళ్ళగలిగే మాయ మంత్రం -"

"మరీ నా గురించి అంత ఎక్కువ వూహించకు. అవి నీ వూహలే, నిజాలు గావు" అని లేస్తూ -

"వెళదామా వంట వండాలి ఆలస్యమవుతుంది-"

"ఓ వెళదాం - " అని లేచి "వంట ఎంత సేపు వదినా - నేను కూరలు, ఉల్లిపాయలు తరిగేస్తే నువ్వు చిటికెలో అద్భుతంగా వండెయ్యగలవు -"

"రామం! నేను మరీ నిన్ను ఆడపిల్లలా చూస్తున్నానేమో - కూరలు కోయించి, బట్టలు మడత పెట్టించి - నీళ్ళు తోడిస్తూ -"

"నీ కోసం నేను ఆడపిల్లగా మారడానికి కూడా తయారు వదినా. నీ వెన కాల తిరుగుతూ నీకు ఆ పనుల్లో సాయం చెయ్యడం ఎంతో హాయిగా, వుల్లాసంగా వుంటుందో తెల్సా?"

## శ్రీదేవి లగ్జరీ?!



'గ్లామర్ క్వీన్' శ్రీదేవికి బాంబేలో ఓ వేన్ వుంది. షూటింగ్స్‌కు ఆ వేన్‌లోనే వెళ్తుంది. ఇంతకీ ఆ వేన్ ప్రత్యేకత ఏమిటో తెలుసా? అందులో ఓ బెడ్‌రూమ్, టాయిలెట్, ఫ్రిజ్, టి.వి., మేకప్ రూం, అన్ని సౌకర్యాలు వున్నాయి. పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ చేయబడిన ఆ వేన్ ఖరీదు కేవలం 18 లక్షలు మాత్రమే!

"ఈ వేన్‌ను నేను లగ్జరీ కోసం ఉపయోగించడం లేదు. బాంబే స్టూడియోస్‌లో మేకప్ రూమ్స్, డ్రెస్ ఛేంజ్ రూమ్స్ చాలా నీచంగా వుంటాయి. అందుకే ఈ ఏర్పాటు చేసుకున్నాను" అంది శ్రీదేవి.

- జగదీష్‌బాబు

ఆమె వస్తున్న నిట్టూర్పుని ఆపుకుంది. పైకి నిట్టూరిస్తే రామం ఎందుకని అడిగి చెప్పే వరకు ఒప్పుకోడు. వైదేహికి ఎక్కడో టూర్స్‌లో రాత్రింబవళ్ళు తిరుగుతున్న మెడికల్ రిప్రజెంటేటివ్ భర్తం చంద్రం గుర్తొచ్చాడు. పెళ్ళయ్యి కాపరానికి వచ్చి తను దాదాపు ఆరు నెలలు కావస్తోంది. అతను ఈ ఆరు నెలల్లో పట్టుమని తనతో యిరవై రోజులు కూడాలేడు. ఆ వున్న రోజుల్లో కూడా తినడం, పడుకోవడం చంద్రం తనూ ఆ రోజు గదిలో ఏదో విషయం చెప్పుకుని నవ్వుకొంటున్నారు. చంద్రం తలకి నూనె రాద్దామనుకుంటుంటే రామం వచ్చాడు. అతని ముఖం అదోలా అయిపోయింది. అంతే! చంద్రం పరిస్థితి చూస్తే తనకే జాలి వేసింది. ఆ జాలి ఇప్పుడు ఆమె మీద ఆమెకు కలగడంతో అప్రయత్నంగా నిట్టూర్చబోయి ప్రయత్నంగా ఆపుకుంది. తన పక్కనే పూల సజ్జ పట్టుకుని నడుస్తున్న రామాన్ని చూసింది. తను చూసినప్పటి నుంచీ అంతే, రామం మొహం అలా కాంతివంతంగా, ఉదయ భానుడిలా ఆత్మీయంగా వుంటుంది. ఇతనివలనే తను చంద్రం రాక పోయినా ఇక్కడ వుండగలుగుతోంది. లేక పోతే అమ్మ నాన్నల దగ్గరే వుండేది.

నడుస్తూ కూడా తననే పరికిస్తున్న వదిన్ని చూసి "ఏం వదినా?" అని నవ్వాడు.


"నీ కళ్ళు ఎంత నిర్మలంగా - మంచు జల్లులో తడిసిన నంది వర్ధనాల్లా వుంటాయి రామం-"

రామం గట్టిగా నవ్వేస్తూ "వదినా! ఇంత సేపు నాది భావుకత అన్నావు. నువ్వు దాని తలదన్నేటట్టు కవిత్వం చెబుతున్నావు-" అన్నాడు.

వైదేహి చిన్నగా నవ్వి వూరుకుంది.

** ** ** **

వాళ్ళిద్దరూ హాల్లోనే రెండు మడత మంచాలు వేసుకుని పడుకున్నారు. వదిన నిద్రలో తుమ్మినా, దగ్గినా కలవరించినా, కలలు కన్నా, రామానికి తెల్సిపోతుంది. ఆకాశంలో తూర్పున, ఉదయ రేఖలు విచ్చుకుంటుండగా, వైదేహి బద్ధంగా కూర్చుని కాళ్ళు ఇలాభూదేవికి తాకించిందో లేదో రామం షాక్ తిన్నట్టు అంత నిద్రలోనూ లేచి కూర్చున్నాడు. అంతగా రామం ఆమెకి ట్యూన్ అయిపోయాడు.




ఒకప్పుడు ఎనిమిది దాటినా లేవని రామం, బెడ్ కాఫీ ఇస్తేగానీ లేవని రామం, సూర్యుడు ఎటు తిరిగితే, అటు తిరిగే ప్రొద్దు తిరుగుడు పువ్వులా వైదేహి చుట్టూ తిరుగుతూ ఆవిడకి పనుల్లో సాయం చేస్తున్నాడు.

ఆ రోజు సాయంత్రం హడావుడిగా కాలేజీ నుంచి వురుకులు పరుగుల మీద ఇంటికి వచ్చిన రామం, వైదేహి తల్లిదండ్రుల్ని చూసి శత్రు సైనికులు ఎదురుపడినట్టుగా జంకి వెనక్కి తగ్గాడు.

తల్లితో మాట్లాడుతూ తండ్రికి 'టీ' కప్పు అందిస్తున్న వైదేహి రామం సంకోచాన్ని గమనించి విశాలంగా నవ్వుతూ "ఏం కన్నా అలా నిలబడి పోయావేం?" రా – అమ్మా, నాన్నా నన్ను సంక్రాంతి పండుగకి తీసుకువెళ్ళడానికి వచ్చారు–" అంది.

ఎన్నడూ లేనిది చాలా ఒందికతో పుస్తకాలు అరలో పెడుతూ జాగ్రత్తగా 'వెడున్నావా వదినా' అన్నాడు. అలా అడుగుతున్నపుడు అతని గుండె రేసు గుర్రంలా పరిగెడుతోంది.

వైదేహి–'నువ్వు వెళ్ళమంటావా?' అంది టీజింగ్‌గా.

రామం మొహం సీరియస్‌గా కుంచించి "బావుంది నీ ఇష్టం. మధ్యలో నా పర్మిషన్ ఏవిటి?" అన్నాడు.

వైదేహి పెద్దగా నవ్వేస్తూ 'నాకు తెలుసు నీకు అప్పుడే కోపం వచ్చిందని. అయినా మా చిన్నికృష్ణుడు పుట్టినరోజు జనవరి 11. ఆరోజు నిన్ను ఒంటరిగా వదిలేసి ఎలా వెడతాను. మీ అన్నయ్యకి సంక్రాంతి పండగకి ఇటే రమ్మని ఉత్తరం రాస్తే సరి'

రామం మొహం వెయ్యిరేకుల పద్మంలా విచ్చుకుంది. వైదేహి తల్లికి మాత్రం ఈ వదినా మరదుల తీరు నచ్చలేదు.

ఆవిడ వెళ్తూ నిష్టూరంగా 'ఏమోనే అమ్మా నిన్న, మొన్న వచ్చిన మరిది కోసం మమ్మల్ని వద్దంటావని, తొలి పండగకే పుట్టిల్లు కాదంటావని అనుకోలేదు' అంది.

తండ్రి మాత్రం గంభీరంగా 'వస్తాం తల్లీ' అని కదిలాడు.

xxx

రామానికి మహా నరకంగా వుంది. అన్నయ్య వచ్చినప్పటి నుంచి వదిన మారిపోయింది. అప్పటికి వెయ్యిన్నొక్కసారి అనుకుని పడుకోలేక మంచం మీద నుంచి లేచి కూర్చున్నాడు. అన్నయ్యకి ఇదివరకటిలా నెలంతా టూర్లు వుంటేనే బాగుండేది. వదిన తనకే వుండేది. ఇప్పుడు వూళ్లో సొంత బిజినెస్ మొదలెట్టినప్పటి నుంచి తన పరిస్థితి మారిపోయింది.

చీకట్లోంచి లేచి హాలు తలుపులేసుకుని బయట వరండాలో పచార్లు చేస్తున్నాడు. రోజూ రాత్రి చక్కగా, తను కాలేజి కబుర్లు చెబుతుంటే వింటూ వూ కొడుతూ మధ్యలో తన వాక్చాతుర్యాన్ని మెచ్చుకుంటూ నిద్రలోకి వెళ్ళిపోయేది. ఇప్పుడు గొప్పగా గుడ్‌నైట్ చెప్పి లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంటోంది. విసుగుతో తీవ్రమైన అసహనంతో చేతికి అందుతున్న జామ చెట్టు కొమ్మని ఫటేల్మని విరిచేశాడు.

భర్త కౌగిట్లో వెచ్చగా పడుకున్న వైదేహి ఆ శబ్దానికి వులిక్కిపడి కళ్ళు తెరిచింది. చంద్రం బలమైన చేతుల మధ్య కొద్దిగా కదిలింది. ఆ కదలికకే అప్రయత్నంగా చంద్రం నిద్రలోనే ఆమెని మరింత గుండెలకి హత్తుకున్నాడు. ఆకాశంలో ఒదిగిపోయే చందమామలా ఆమె మరింతగా అతనిలో కలిసిపోతూ బయట అలికిడిని బట్టి రామం నిద్రపోకుండా వరండాలో తిరుగుతున్నాడు అని గ్రహించగలిగింది. ఎంతో చక్కగా, హాయిగా వుండేవాడు. ఈ మధ్య ఎందుకు చిరాకుగా, వెర్రెత్తినట్టు, మంకుగా ప్రవర్తిస్తున్నాడు అనుకుంది.

అతడ్ని అర్థం చేసుకోవడానికి అడ్డం పడుతున్న ఈ విపరీత ప్రవర్తన ఆమెలో కూడా అసహనాన్ని, చిరాకుని కలిగిస్తోంది.

రామం నిద్రలేచి నిరాసక్తంగా నూతిదగ్గర పళ్లు తోముకుని బద్ధకంగా తుండుతో మొహం తుడుచుకుంటూ లోపలికి వచ్చేసరికి బాత్రూంలో భర్తతో

వైదేహి పరాచికాలాడుతూ నలుగు పెడుతోంది.

వంటింట్లోకి వచ్చిన రామాన్ని లోపల్నుంచి గమనించి, "చూశావా రామం మీ అన్నయ్య చర్మం దళసరి అని మనం జోక్ చేస్తాం. కానీ పాపం 'నిజం' అదికాదు టూర్లలో తిరిగి తిరిగి దుమ్ము మందంగా పేరుకుని చర్మం దళసరి అయింది. ఆ దుమ్ము దులిపి మీ అన్నయ్యని సెన్సిటివ్ చేస్తున్నా" అంది.

రామానికి ఆ మాటలు రుచించలేదు. తను లేవగానే చిర్నవ్వుతో పలకరించి తాను మొహం కడగగానే వేడి టీ కప్పుతో ఎదురువస్తూ 'రాత్రి బాగా నిద్రపట్టిందా కన్నా' అనడిగే వదిన ఇలా మాట్లాడడం అందులో వాళ్లాయన ప్రసక్తి అతనికేం నచ్చలేదు.

విసురుగా 'టీ ఎక్కడ?' అన్నాడు. అతని కంఠ స్వరంలో ధ్వనించిన ఇరిటేషన్‌కి వైదేహికి చిరాకు కలిగి 'స్టవ్ మీద పెట్టి వుంది. వేడి చేసుకుని తాగు' అంది.

వదిన నిరసనగా అలా అనేసరికి–

"నాకొద్దులే–" అని విసరుగా అక్కడినుంచి వెళ్లిపోయాడు.

అదే గతంలో ఇలా జరిగితే – వైదేహిదే. కప్పుతో వెనకే వచ్చి – "అమ్మో! మా కన్నాడికి ఎంత కోపం వచ్చింది–" అంటూ బ్రతిమలాడి తను టీ త్రాగే వరకు ఊరుకునేది కాదు.

లోపలికి వెళ్ళి, హాలులో కూర్చుని, ఆ రోజు డైలీ తిరగేస్తూ – వదిన వచ్చి తనని బ్రతిమలాడు తుందనే మూడ్‌లో వున్నాడేమో వైదేహి రాకుండా భర్తకి తలస్నానం చేయించి ఆయనకు వేడివేడి ఉప్మా చెయ్యడం హడావుడిలో పడేసరికి అతని గుండెలో బడబాగ్ని రగలడం ప్రారంభం అయింది.

* * *

చంద్రం షేవ్ చేసుకుంటున్నాడు. బెడ్‌రూంలో కూర్చుని, చాకుతో బంగాళా దుంపలు చెక్కుతూ భర్త చెబుతున్న రియల్ ఎస్టేట్ బిజినెస్ వివరాలు పరిశీలనగా, కుతూహలంగా వింటోంది.

రామానికి వదిన లేకుండా బయట హాల్లో కూర్చోవాలంటే చిరాగ్గా ఉంది. గబుక్కున తనూ వాళ్ళ మాటల్లో మాటలు కలపాలని వుంటుంది. గతంలో తాను అలా కలిపించుకుని మాట్లాడినా– తన మాటల్ని అలా వుంచేసి, వాళ్ళిద్దరూ మాత్రం ఒకళ్ళ మాటల్ని మరొకరు అందుకుంటూ, అల్లుకుంటూ వెళ్ళిపోతూ రామాన్ని అలక్ష్యం చేశారు. ఆ హర్ట్ భరించలేక, వాళ్ళకి దూరంగా వుండడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ భరించలేకపోతున్నాడు.

వైదేహి ఇల్లాలి ఏకాగ్రతని భంగం చేస్తూ – "వదినా టిఫిన్" అనరిచాడు బయట హాల్లోంచి.

"డైనింగ్ టేబిల్ మీద పెట్టాను. తిను–" అని సమాధానం ఇచ్చి మళ్ళీ భర్త చెబుతున్న మాటల ధ్యాసలో పడిపోయింది.

రామంలో ఉక్రోషం ఉప్పెనలా ఎగదన్ని అతనిలో విచక్షణా జ్ఞానాన్ని ముంచేసింది. తను వంటింట్లో కబుర్లు చెబుతూ, గ్యాస్ సిలెండర్ మీద కూర్చుండే– తన చేతిలో వేడి వేడి ఉప్మా ప్లేటు పెట్టి – తను వూదుకుంటూ తింటుంటే – తను కూరగాయలు కోస్తూనో, వంట చేస్తూనో లేదా తనతో ఆనాటి వారపత్రికల్లో వస్తున్న సాహిత్యాన్ని చర్చిస్తూ – ఎంత చక్కగా వుండేది తనతో – ఆ అనుభూతుల రంగుల అద్దిక ఇలా వెలిసిపోయిందేం? తను ఎందుకు వదినకింత వెగటై పోయాడు. వంటి భావాలు ముప్పిరిగా ఊపిరికి అడ్డం పడుతుంటే, విసురుగా వెళ్ళి టిఫిన్ ప్లేటుని గోడకేసి కొట్టాడు. గాజు ప్లేటు ధన్‌మనే శబ్దంతో ముక్కలై విరిగి నేలమీద పడి నిశ్శబ్దమైనాయి. అతను విసురుగా అక్కడి నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

* * *

ఆ రోజు శుక్రవారం.

ఊరంతా వెడ తిరిగి, మధ్యాహ్నం భోజనం కూడా చెయ్యకుండా సాయంత్రానికి ఇల్లు చేరుకుని, డాబా మీద వెల్లకిలా పడుకున్న రామానికి సడన్‌గా ఆరోజు శుక్రవారం అని గుర్తొచ్చింది.

గబుక్కున లేచి కూర్చున్నాడు. వదిన గుడికి వెళ్ళాలి అంటుంది. దారిలో అసలు తనని ఎదుకిలా నిర్లక్ష్యంగా చూస్తోందో అడిగెయ్యాలి అనుకుంటూ గబగబా మెట్లు దిగి కిందకి వచ్చాడు. సరిగ్గా అప్పుడే – చక్కగా ముస్తాబై తలుపుకి తాళం వేసి వైదేహి బయటకు వస్తోంది. చంద్రం స్కూటర్ స్టార్ట్ చెయ్యబోతున్నాడు.

చంద్రం రామాన్ని చూసి – "ఏరా! నువ్విక్కడే వున్నావా ఎటుపోయావో అనుకున్నాం–" అన్నాడు.

వైదేహి సన్నగా నవ్వి – "ఆయన గారికి ఈ మధ్య రాచకార్యాలు ఎక్కువై పోయాయి. ఇంటిపట్టున వుండడం నామోషీగా వుంది కాబోల్సు–" అంది.

ఆ మాటలకి రామంలో కోపం ఉవ్వెత్తున లేచింది. 'నీ ప్రవర్తనే నన్ను ఇంట్లో వుండనివ్వకుండా తిప్పు తోంది' అందామనుకుని అంత బండగా మాట్లాడలేక ఆగాడు.

"మేం గుడికి వెళ్ళి – అట్నుంచటు సినిమాకి వెడుతున్నాం. ఇవిగో తాళాలు. అన్నం కూరా వండేశాను. ఆకలైతే భోంచేసెయ్యి" అని తాళాల గుత్తి అతనికి అందించడానికి చెయ్యి చాపింది.

ఆ తాళాలు చూడగానే ఎందుకో ఒక పిచ్చి నవ్వు అతనిలోంచి పొంగుతూ బయటకి వెల్లువైంది. 'నువ్వు పక్కన లేకపోతే, గుమ్మం దాటడమే కష్టం అన్న వదిన, తనని ఇంటికి కాపలా పెడుతోంది' అనుకోగానే, రావణాసురుడు పెళ్లగించినప్పుడు కైలాసం వణికినట్టు, అతని హృదయం పుచ్ఛతమవుతున్న భావాల తీవ్రతని తట్టుకోలేక గిజగిజలాడింది.

ఎటువంటి సమాధానం చెప్పకుండా, తనలో తను నవ్వుకుంటూ, గాలిలో అడుగులేస్తున్నట్టు తేలిగ్గా నడుస్తూ, బయటికి వెళ్లిపోతున్న రామాన్ని వైదేహి, చంద్రం వింతగా చూస్తూండిపోయారు.

– మిగతా వచ్చేవారం

## 'సుకన్య' స్థానంలో 'ఐశ్వర్య'



పార్తిబన్ చిత్రం 'ఉళ్ళె–వెలియె'లో నటించవలసిన సుకన్య, ఇప్పుడు ఆ చిత్రం నుంచి తప్పుకోవటంచేత, ఛాన్సుని ఐశ్వర్య పట్టేసింది. ఈ ఛాన్సుని ఉపయోగించుకోవాలని అనేక తారలు పోటీపడ్డ సంగతి చాలా మందికి తెలుసు. ఇంత మందిలో మరి ఐశ్వర్యకే ఈ ఛాన్సు ఎందుకు దొరికిందంటారు? "భాగ్యరాజా గారి చిత్రం 'రాసుకుట్టి'లో నటించడంవల్ల నాకు జరిగిన మంచి ఇదంతా!" అని చెప్తూ వుంది నటి ఐశ్వర్య.

– ఎస్. భాస్కరరావు